సాక్షి
కుమురం భీం

శనివారం । 8 । జూన్ । 2024



జూన్.. బతుకు భారమే..
జూన్ నెల అంటేనే సామాన్యులు భయపడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. వ్యవసాయానికి పెట్టుబడి, పిల్లల చదువుల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. 8లో



వన్యప్రాణులకు రక్షణేది?
మండుతున్న ఎండలకు దాహార్తి తీర్చుకునేందుకు గ్రామాల్లోకి వచ్చిన వన్యప్రాణులపై కుక్కలు దాడి చేయడంతో మృత్యువాత పడుతున్నాయి. 9లో

గరిష్టం/కనిష్టం
37.5 /28.4

వాతావరణం
ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో చాలాచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన గ్రూప్‌-1 ప్రశ్నపత్రాలు



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: గ్రూప్‌–1 పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఓఎంఆర్ షీట్స్ శుక్రవారం జిల్లాకు చేరినట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. వాటిని కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త లక్ష్మీ నరసింహ, సీఐ సతీష్, పర్యవేక్షకులు షరీఫ్, మునావార్, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర అడిషనల్ కలెక్టర్‌గా జిల్లావాసి



బాధ్యతలు స్వీకరిస్తున్న డోంగ్రి రేవయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని తుంగెడ గ్రామం లోని పేద కుటుంబానికి చెందిన డోంగ్రి రేవయ్య 2022–23 సివిల్స్ పరీక్షలో ఆలిండియా స్థాయిలో 410వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. ఐఏఎస్‌గా ఎంపికైన ఆయన శిక్షణ పూర్తి చేసుకుని మూడు రోజుల క్రితం మహారాష్ట్రలోని వార్ధా జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. చిన్నతనంలో తండ్రికి దూరమైన రేవయ్యను తల్లి విస్తారుబాయి ఎంతో కష్టపడి పెంచి పెద్ద చేసింది. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తూ ఉన్నత స్థాయికి చేర్చింది. ఎంతో కష్టపడి రెండో ప్రయత్నంలోనే సివిల్స్‌కు ఎంపికైన రేవయ్య అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడటంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఐపై చర్యలకు ఎస్పీకి వినతి



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: హిందూ దేవుళ్లు, పూజారిని దూషించిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబుపై చర్యలు తీసుకోవాలని బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు శుక్రవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జగన్నాథ్‌పూర్ గ్రామంలోని భీమన్న ఆలయం వద్ద గత నెల 24న భూవివాదం జరుగుతుండగా అక్కడికి వెళ్లిన సీఐ ఆలయ కమిటీ సభ్యులు భామిని బికారి, సురేశ్, మహేశ్, ఆలయ పూజారి భామిని శంకర్‌తో పాటు హిందూ దేవుళ్లను తిట్టడంతో అదేరోజు డీఎస్పీ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన తెలిపి, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు వినతిపత్రాలు అందజేశామన్నారు. రెండు రోజుల్లో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని చెప్పి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ విషయమై హెచ్ఆర్‌సీ, నేషనల్ బీసీ కమిషన్ సభ్యులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివాగౌడ్, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, న్యాయవాది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

'వార్షిక పరీక్షల పారితోషికం చెల్లించాలి'

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్ వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి పారితోషికం వెంటనే చెల్లించాలని జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాలలో నిర్వహిస్తున్న స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో ఆసిఫాబాద్ కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో డీఐఈవో శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పరీక్ష విధులకు సంబంధించిన మొత్తంతో పాటు, స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి పారితోషికం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గేజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు మరేందర్, చంద్రయ్య, రాజమౌళి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కౌలుకోలేని కష్టాలు!



- విత్తన, ఎరువుల ధరలకుతోడు పెరుగుతున్న కౌలు..
- ప్రైవేటు అప్పులతో పెరుగుతున్న భారం
- జిల్లాలో 30 వేలకుపైగా కౌలు రైతులు
- రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం హామీ..
- నెరవేర్చాలంటున్న కౌలు రైతులు

తిర్యాణి: జిల్లాలోని రైతులు వానాకాలం సాగు పనులను ప్రారంభించారు. అయితే రాష్ట్రంలో ఉన్న కౌలు రైతులందరికీ రైతు భరోసా పథకం కింద సీజన్‌కు రూ.12 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రజాపాలన పేరిట దరఖాస్తులను సైతం తీసుకున్నారు. కానీ వర్షాకాల పంటలకు సంబంధించి సాగు పనులు ప్రారంభమైనా రైతు భరోసాకు సంబంధించి విధి విధానాలు ఖరారు కాలేదు. దీంతో కొత్త ప్రభుత్వంలోనైనా కౌలు రైతు న్యాయం జరుగుతుందో లేదోనని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా కౌలు ధరలు పెరుగుతుండటం.. ప్రైవేటుగా అప్పులు తెచ్చి సాగు చేయడం.. అష్టకష్టాలుపడి పండించిన పంటను అమ్ముకోడానికి తీవ్ర ఇబ్బందులు పడడం.. వెరసి కౌలురైతులకు సాగు కష్టాలు తప్పడంలేదు. జిల్లాలో దాదాపు 30 వేలకు పైగా కౌలురైతులు ఉన్నారని వ్యవసాయ అధికారుల అంచనా..

ఏటా పెరుగుతున్న కౌలు..
కౌలు వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారితో పాటు ఉద్యోగులు, వ్యాపారులు తమ భూములను ఎకరం, అరెకరం భూములున్న రైతులకు కౌలుకు ఇస్తున్నారు. రెండేళ్ల క్రితం కౌలుధరలు అంతంత మాత్రంగానే ఉండేవి. కానీ ప్రస్తుతం కౌలుధరలు అమాంతం పెరుగుతున్నాయి. ఒక్కో ప్రాంతాన్ని బట్టి ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలు తీసుకుంటున్నారు. గత సీజన్ వరకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన రైతుబంధు సాయం ఎకరాకు రూ.10 వేలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి కూడా భూ యజమానులకే దక్కుతోంది. కానీ కొత్త ప్రభుత్వం రైతు భరోసా కింద అందించనున్న సాయం కౌలురైతులకు వర్తింజేస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

చివరిదాకా కష్టాలే..
కౌలు రైతుకు సాగు సీజన్ ప్రారంభం నుంచి మొదలుకుని సీజన్ పూర్తి అయ్యే వరకూ కష్టాలే వెన్నంటి ఉంటున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ రంగంలోని ప్రతిదీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. విత్తనాలు కొనుగోలు చేయడం నుంచి ఎరువులు, పురుగు మందులు, పంటలను అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకెళ్తున్న సమయంలో పట్టాదారు పాసు పుస్తకాల ఆధారంగానే క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కౌలురైతులకు పట్టా పాసు పుస్తకాల జిరాక్స్‌లు ఇచ్చేందుకు భూ యజమానులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడం కోసం, పండించిన పంటను అమ్ముకోవడం కోసం దళారులను ఆశ్రయించి మోసపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పంటల సాగుకు పెట్టుబడులకోసం బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధికవడ్డీకి అప్పులు చేస్తున్నారు. దీంతో పాటు వానాకాలం, యాసంగి సీజన్‌లో ప్రకృతి ప్రకోపానికి పంటలను నష్టపోవాల్సి రావడంతో కౌలురైతుకు ఆశించిన ఫలితం దక్కడం లేదు. ఈ పరిస్థితులల్లో చాలా సవరకు పెట్టుబడులు, కౌలు కూడా చెల్లించలేని దుస్థితి. కౌలురైతులకు ప్రభుత్వం కనీసం ఇన్సూరెన్స్ సదుపాయం, పంట నష్టపరిహారం వర్తింపజేయకపోవడంతో ఎలాంటి ఆసరా లేకుండా పోయింది.

రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలి



నాకు అరెకరం వ్యవసాయ భూమి ఉంది. దీనికితోడు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నా. కౌలుడబ్బులే కాకుండా పెట్టుబడికి రూ.80 వేల వరకు ఖర్చు అవుతోంది. మొత్తంగా ఐదెకరాలకు రూ.1.30 లక్షలు అవుతోంది. గతేడాది పంట దిగుబడి రాక రూ.20 వేలు నష్టపోయా. ప్రభుత్వం కౌలు రైతులకు సైతం రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలి.

– కోర్విత లక్ష్మణ్, కోర్లంక

గ్రూప్‌–1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: గ్రూప్‌–1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూట్ అధికారులు పరీక్ష జరిగే రోజు ఉదయం 6 గంటలకు జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన వాటిల్లో నిర్ణయించిన ప్రశ్నపత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య తమకు కేటయించిన పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు అందించాలన్నారు. పరీక్ష ముగిసిన తర్వాత జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూంకు తీసుకురావాలన్నారు. పరీక్ష రోజు పట్టణంలో అన్ని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 13 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసిఫాబాద్‌లోని 6 కేంద్రాల్లో 1,271 మంది, కాగజ్ నగర్‌లోని 7 కేంద్రాల్లో 1,512 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. మహిళా అభ్యర్థులు ఎలాంటి ఆభరణాలు ధరించవద్దన్నారు. అభ్యర్థులు బాల్‌పెన్, హాల్‌టికెట్, రెండు పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్, జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహం, డీఎస్పీ సదయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరీక్షకు పటిష్ట బందోబస్తు
జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్‌–1 పరీక్షకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్పీ సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పట్టణంలోని ప్రధాన రోడ్డు, చౌరస్తాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసరం కోసం ఒక అంబులెన్స్ ఉంటుందని, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- ఎస్పీ సురేశ్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్ కుమార్

ఆసిఫాబాద్: అనుమతి లేకుండా పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సురేశ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బక్రీద్‌ను పురస్కరించుకుని పశువులను అక్రమంగా రవాణా చేసే అవకాశం ఉన్నందువల్ల పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారుల సమన్వయంతో జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికతో కార్యాచరణ సిద్ధం చేస్తోందన్నారు. మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహనాల తనిఖీ చేపడుతున్నామన్నారు. వధశాలకు అనుమతి లేని పశువులు, దూడలు, గోవులు అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఈ విషయాన్ని పశువుల వ్యాపారులు గమనించాలన్నారు. పశువులను రవాణా చేయడానికి పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. పశువుల సంతలో కొనుగోలు చేస్తే విక్రయించిన వారి వివరాలు, పశువైద్యాధికారి ధ్రువీకరించిన పత్రాలు, రవాణా అనుమతిపత్రాలు ఉండాలన్నారు. పండగలు పూర్తయ్యే వరకు అదనంగా వాహనాల పెట్రోలింగ్‌తో పాటు నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతియుత జిల్లాగా గుర్తించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కారు పంచర్!



ఆదిలాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఫైల్)

- డిపాజిట్ కోల్పోయి కదలలేని స్థితికి..
- అన్ని నియోజకవర్గాల్లో మూడోస్థానం
- ఎమ్మెల్యేలున్న చోటా.. ఇదే పరిస్థితి
- 'అసెంబ్లీ' ఫలితాల తర్వాతే కష్టాలు
- ఓటమితో బీఆర్ఎస్‌ను వీడిన నేతలు
- జీర్ణించుకోలేకపోతున్న కార్యకర్తలు

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గులాబీ పార్టీ ఆరుసార్లు పోటీ చేయగా, 2004లో మధుసూదన్‌రెడ్డి, 2014లో గోడం నగేశ్ గెలుపొందారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డి ఓటమి చెందారు. అప్పుడు 18.86 శాతం ఓట్లు మాత్రమే సాధించారు. అయితే తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అంతకంటే తక్కువ ఓట్లతో సరిపెట్టుకుంది. పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కుకు 11.11 శాతం ఓట్లు మాత్రమే రాగా డిపాజిట్ కోల్పోయారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ పార్టీలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పుడున్న పరిస్థితిలో పార్టీ కోలుకోవడం కష్టమేనన్న అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కారు పంచర్ అయిందని ప్రత్యర్థులు ఎద్దేవా చేసే పరిస్థితికి వచ్చింది.

మూడో స్థానానికి పరిమితం
కారు పార్టీ ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడో స్థానానికి పడిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్, బోథ్‌లో ఆ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. సిర్పూర్, ఖానాపూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోయినా ద్వితీయ స్థానంలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పార్టీకి నిర్మల్, ముధోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో కోలుకోలేని దెబ్బతగలగా, మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. కాగా, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న బోథ్, ఆసిఫాబాద్‌లోనూ గులాబీ పార్టీ మూడో స్థానానికి పడిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలల్లోనే ఇంత తేడానా.. అనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది.

2023 అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	అసెంబ్లీ	పార్లమెంట్
సిర్పూర్	60,614	19,840
ఆసిఫాబాద్	83,036	38,597
ఖానాపూర్	54,168	18,520
ఆదిలాబాద్	60,916	16,265
బోథ్	76,792	22,472
నిర్మల్	55,697	8,181
ముధోల్	74,523	12,505

పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఓట్ల శాతం

అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్లు :
4,65,476 (35.59 శాతం)

పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన ఓట్లు :
1,37,300 (11.11 శాతం)

పూర్వవైభవం సాధ్యమేనా?
బీఆర్ఎస్‌కు పూర్వవైభవం సాధించడం కష్టమేనన్న అభిప్రాయం పార్టీ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి ఏకంగా డిపాజిట్ కోల్పోవడంతో ప్రస్తుతం ఈ విషయంపై చర్చసాగుతోంది. పార్టీ నుంచి ముఖ్యనేతలు జారుకున్నప్పటికీ కార్యకర్తలు అండగా ఉన్నారని, ఆ బలంతోనే తిరిగి పూర్వవైభవం సాధిస్తామని పార్టీ అగ్రనేతలు పేర్కొంటున్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుతం బోథ్ ఎమ్మెల్యేగా అనిల్‌జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కోవ లక్ష్మితోపాటు సిర్పూర్‌లో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్‌లో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, నిర్మల్‌లో సీనియర్ నేత రాంకిషన్‌రెడ్డి, ముధోల్‌లో పడకంటి రమాదేవి, డాక్టర్ కిరణ్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ లాంటి ముఖ్యనేతలు మాత్రమే మిగిలారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ పార్టీ ఏ మేర ప్రభావం చూపుతుందనేది చూడాల్సిందే.

61 ఏళ్లు దాటితే ఉద్యోగం ఊస్ట్!

- సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు వయస్సు గండం
- 61 ఏళ్లు దాటిన వారిని తొలగించాలని ఆదేశాలు జారీ
- ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగులు
- ప్రోత్సాహకంగా రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్



కెరమెరిలో ఎమ్మార్సీ విధుల్లో ఎంఐఎస్, సీసీవో

కెరమెరి(ఆసిఫాబాద్): ఉద్యోగ విరమణ వయస్సు ఈ ఏడాది నుంచే అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంతో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 61 ఏళ్ల పైబడిన వారిని విధుల్లోకి తీసుకోవద్దని పేర్కొనడంతో ఎస్ఎస్ఏలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. 15 ఏళ్లుగా తమ సేవలు వినియోగించుకున్న అధికారులు ఎలాంటి బెనిఫిట్స్ లేకుండానే ఉద్యోగాల నుంచి తొలగించడం సమంజసం కాదని మండిపడుతున్నారు. అంగన్‌వాడీల రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లు చేశారని, తమకు కూడా 65 ఏళ్ల వరకు కొనసాగే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

15 ఏళ్లుగా సేవలో...
సమగ్ర శిక్షలోని వివిధ స్థాయిల్లో కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 15 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో క్లస్టర్ స్థాయిలో ఉన్న రిసోర్స్‌పర్సన్లు, ఎంఆర్‌సీలో ఉన్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీవోలు, జిల్లా కేంద్రాల్లో ఉన్న డీపీవో సిబ్బంది, కేజీబీవీలు, యూఆర్ఎస్‌లో ఉన్న ఎస్‌వోలు, సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, పీటీఐ, మెసెంజర్లు, అటెండర్లు, నాన్‌టీచింగ్, భవిత కేంద్రాల్లో ఐఈఆర్‌పీలు రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల మంది ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,988 మంది ఉన్నారు. వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదు. వారి సమస్యలను పరిష్కరించక పోగా 61 ఏళ్లకు పైబడిన వారిని ఉద్యోగంలోంచి తొలగించాలని సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య భట్టు ఉత్తర్వులు జారీ చేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

త్వరలో నాన్‌టీచింగ్ సిబ్బంది
సమగ్ర శిక్షలోని కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బందిలో అధికశాతం 50 నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉన్నారు. ఒక్క కుమురం భీం జిల్లాలో 90 మంది ఉండగా ఉమ్మడి జిల్లాలో 250కి పైగా ఉన్నారు. వీరిలో ఎక్కువమంది నిరక్షరాస్యులు ఉండడం వల్ల ఆధార్ కార్డుల్లో వయస్సు తప్పుగా ముద్రించబడింది. తక్కువ వయస్సు ఉన్నప్పటికీ ఆధార్ కార్డుల్లో ఎక్కువ పడింది. 58 నుంచి 61 ఏళ్ల మధ్యలో ఉన్న వారు ఉమ్మడి జిల్లాలో 50 నుంచి 70 మంది వరకు ఉన్నారు. వారంతా ఎస్‌పీడీ ఆదేశాల మేరకు త్వరలో రిటైర్ కానున్నారు. ఎలాంటి ప్రోత్సాహకం లేకుండా ఉద్యోగులను తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో సమగ్ర శిక్ష ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

సీఎం హామీ నిర్వీర్యం!
గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా వరంగల్ ధర్నా చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలకుపైగా గడుస్తున్నప్పటికీ సమగ్రశిక్ష ఉద్యోగుల గురించి ఎలాంటి ప్రకటన చేయడం లేదు. సంఘం రాష్ట్ర నాయకులు పలుమార్లు సీఎంకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి హామీ ఇవ్వకపోగా 61 ఏళ్లకు పైబడిన వారిని తొలగించాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ఎస్ఎస్ఏ ఉద్యోగులు
ఆదిలాబాద్	607
కుమురంభీం	456
మంచిర్యాల	501
నిర్మల్	424

ఎస్ఎస్ఏల డిమాండ్లు
- రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ అయ్యాక నెలకు కనీసం రూ.10 వేలు అందించాలి.
- సమగ్ర శిక్ష ఉద్యోగులను 100 శాతం రెగ్యులర్ చేయాలి.
- అప్పటి వరకు ఎంటీఎస్(మినిమం టైం స్కేల్) అమలు చేయాలి.
- రూ.10 లక్షల జీవిత, ఆరోగ్య బీమా చెల్లించాలి.
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

బెనిఫిట్స్ కల్పించాలి



ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లకు పెంచాలి. 61 ఏళ్లు నిండిన ఉద్యోగులను ఉన్నఫళంగా తొలగించడం సరికాదు. ఎలాంటి ప్రోత్సాహకం లేకుండా విధులకు రావద్దని చెప్పడం సమంజసం కాదు. ప్రభుత్వం మరోసారి ఆలోచించి సమగ్రశిక్ష ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా తగు నిర్ణయం తీసుకోవాలి.

– దహెగాం పవన్‌కుమార్, సీఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్షుడు, కుమురంభీం

పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన(ఆసిఫాబాద్): బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ పండుగ వాతావరణంలో పాఠశాలలు పునః ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం మండలంలోని తక్కళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి హాజరయ్యారు. ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ కలిసి ప్రచురించిన కరపత్రాలను డీఈవో అశోక్‌తో కలిసి ఆవిష్కరించారు. వివిధ ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం పొందుతున్న 50 మంది విద్యార్థులను కలెక్టర్, డీఈవో పాఠశాలలో జాయిన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుండి 14 ఏళ్ల లోపు బడీడు, బడి బయటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడమే బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థి గొప్ప విజయాలు సాధించవచ్చన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే రోజున యూనిఫాం, నోట్‌బుక్కులు, పుస్తకాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డీఆర్‌డీవో సురేందర్, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఎంపీపీ సౌందర్య, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

9న క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-19, అండర్-25 జిల్లా క్రికెట్ టీం సెకండ్ లీగ్ మ్యాచ్ ఎంపిక పోటీలు ఈ నెల 9న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కోదాటి ప్రదీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోని క్రికెట్ నెట్స్‌లో రిపోర్టు చేయాలని, వైట్‌డ్రెస్, క్రికెట్ కిట్, పుట్టిన తేదీ సర్టిఫికేటు తీసుకు రావాలని కోరారు.

ఓసీపీని సందర్శించిన డైరెక్టర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిని కంపెనీ డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ రావు సందర్శించారు. శుక్రవారం ఆయన ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి ఓసీపీలోని బేస్ వర్క్‌షాప్, స్టోర్స్‌ను పరిశీలించారు. యంత్రాల స్పేర్స్ ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, యంత్రాలు వినియోగించే సమయం పెంచాలని అన్నారు. వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు డైరెక్టర్ కేవీ రావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ పీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాకు 'బాపూజీ' పేరు పెట్టాలి



అంబేద్కర్ చౌరస్తాలో నాయకుల ప్రదర్శన

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లాకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వాంకిడి గ్రామంలో జన్మించి మంత్రి పదవి అధిరోహించే స్థాయికి ఎదిగాడని అన్నారు. నాటి స్వాతంత్ర్య పోరాటం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు అనేక పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాపూజీకి సముచిత స్థానం, సరైన గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తులా మధుసూదన్, గజెల్లి వెంకటయ్య, నల్ల నాగేంద్రప్రసాద్, శ్రీపతిరాములు, భీమ్‌సేన్, భిక్షపతి, కొంతంరాజు, చంద్రమౌళి, అంకం సతీష్, ఆరెందుల రాజేశం, బండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం



సత్యసాయి నగర్ కాలనీలో మంటలు ఆర్పుతున్న స్థానికులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి సత్యసాయినగర్ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కాలనీ వాసులు నీరు తెచ్చి చల్లార్చడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ వైర్లు మండడంతో రాలిన నిప్పు రవ్వలు కింద ఉన్న చెత్తకుప్పలపై పడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. స్థానికులు బకెట్లతో నీరు పోసినా చల్లారలేదు. మున్సిపాలిటీ వాటర్ ట్యాంక్ ద్వారా మంటలు ఆర్పడంతో ఎలాంటి ఆస్తి నష్టం జరుగలేదు.

జూన్.. బతుకు భారమే..

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన రేని మల్లయ్య అనే రైతు వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న రెండెకరాలకు తోడు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రస్తుతం పత్తి, పసుపు పంటలు వేసేందుకు దుక్కి దున్ని చదునుచేసి ఉంచాడు. విత్తనాలు, భూమి చదును, ఎరువులు వంటి వాటికోసం ఖర్చులు పెద్ద మొత్తంలో అవుతున్నాయని వాపోతున్నాడు.

చాట్ల రమేశ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలోనే అద్దెకు ఉంటున్నాడు. తన ఇద్దరు పిల్లలను స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాడు. నెలవారీ ఖర్చులు ఎలాగూ ఉండగా ప్రస్తుతం జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభం కానున్న తరుణంలో అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ వంటి వాటికోసం మరింత అదనపు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నాడు.

- వ్యవసాయ పెట్టుబడులకు వ్యయం
- ఇక బడుల్లోనూ ప్రవేశాల ఖర్చు తడిసి మోపెడు
- మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం



దుక్కి దున్నుతున్న ట్రాక్టర్(ఫైల్)

ఖర్చుల భారం ఇలా...

ప్రైవేటు చదువులకు ఖర్చులు:
పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిల్లో: అడ్మిషన్ ఫీజు రూ.5 నుంచి రూ.7వేలు
స్కూలు, ట్యూషన్ ఫీజు రూ.15 నుంచి రూ.30వేలు
పుస్తకాలకు రూ.4వేల నుంచి రూ.8వేలు
రెండు జతల యూనిఫాం రూ.3వేల నుంచి రూ.5వేలు
బస్సు రవాణా కోసం రూ.16 నుండి రూ.20 వేలు
హాస్టల్ వసతికి రూ.40 వేల నుంచి రూ.70వేలు

వ్యవసాయ పెట్టుబడులకు ఎకరాకు ఇలా..

పత్తి విత్తనాలు	రూ. 2వేలు..
దుక్కి, సన్నద్ధత కోసం	రూ.6 నుండి 8వేలు
కూలీల ఖర్చు	రూ. 3వేలు
ఎరువులు	రూ.6వేలు
పురుగు మందులు	రూ.16వేలు
పత్తి తీయడానికి	రూ.4వేలు
మొత్తం	రూ.40 వేలు
వరి	రూ.60 వేలు
మొక్కజొన్న	రూ.35 వేలు

ఖర్చు పెరుగుతోంది..



పిల్లల చదువు కోసం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉంటున్నా. ఒకవైపు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నే మా ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్నా. చదువుల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు రోజువారీ ఖర్చులు నిత్యావసరాలు, ఇంటిఅద్దె పోనూ రూపాయి కూడా మిగలడం లేదు. మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి వస్తోంది. – తక్కలపల్లి సునీల్ కుమార్, ప్రైవేటు ఉద్యోగి, నిర్మల్

రెండువైపులా భారం..



జూన్ వచ్చిందంటే చాలు రెండువైపులా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఒకవైపు పిల్లల చదువులపై, మరోవైపు పంట పెట్టుబడులు. ఇలా రెండు వైపులా ఒకేసారి ఒకే నెలలో ఖర్చు పెట్టాల్సి రావడంతో భారం పడుతోంది. ఏటా వేసవి సెలవులు పూర్తవుతున్నాయంటేనే తీవ్ర మానసిక ఒత్తిడి కలుగుతోంది. – దాసరి గణేశ్, రైతు, కౌట్ల(బి), సారంగపూర్

నిర్మల్‌ఖిల్లా: ఇలా జూన్ నెల అంటేనే సామాన్యులు భయపడే పరిస్థితి తలెత్తుతోంది. జూన్ మొదటి వారం నుంచి వ్యవసాయానికి పెట్టుబడి కాలం. పిల్లల చదువుల కోసం అన్నిరకాల ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతున్నాయి. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలు జూన్ వచ్చిందంటేనే దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మృగశిర కార్తె నుంచి ఖర్చులు కూడా మొదలవుతున్నాయి. వాతావరణం చల్లబడుతున్న తరుణంలో సామాన్యులకు మాత్రం జూన్ మాసం ముచ్చెమటలు పట్టిస్తోంది. దిగువ మధ్యతరగతి వ్యవసాయ ఆధార కుటుంబాల ప్రజానీకం ఖర్చులకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

అన్నదాత పరిస్థితి అగమ్య గోచరమే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 6 లక్షలకు పైగా రైతులు ఉన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలకు పెట్టుబడి కాలం.. వ్యవసాయ పంట భూములను చదును చేసి, దుక్కిదున్ని, విత్తనాలు, ఎరువులకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వ్యవసాయదారులు దుక్కులు, విత్తనాల కొనుగోలు వంటి పనులు ప్రారంభించారు. కనీసం ఎకరానికి రూ.30 వేల పెట్టుబడికి అవసరం కానుంది. ఐదెకరాలున్న రైతు దాదాపు రూ.లక్షకు పైగా డబ్బు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వస్తున్నా అది సరైన సమయానికి చేతికందడం లేదు. పైగా బ్యాంకుల రుణాలు కూడా అవసరమైన సమయానికి అందడం లేదు. దీంతో రైతులు ఒకవైపు బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే మరోవైపు ప్రైవేటు వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అటు పిల్లల చదువులు ఇటు వ్యవసాయ పెట్టుబడికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

పిల్లల బడి ఫీజులు భారం..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 800కు పైగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. గ్రామీణ, మండల స్థాయిలో కొంతమేర తక్కువ ఫీజులు వసూలు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో ఫీజులు ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. ప్రీ ప్రైమరీ తరగతులకు రూ.30 వేలకు పైగా, ప్రైమరీకి రూ.40వేలు, హైస్కూల్‌కు రూ.50 వేల వరకు ఫీజులు ఉన్నాయి. ఏటా 10 నుంచి 20 శాతం మేర ఫీజులు పెరుగుతుండడంతో తల్లిదండ్రులపై భారం పడుతోంది. దీనికి తోడు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం, బ్యాగులు స్టడీ మెటీరియల్ ఇతర ఇతర ఖర్చులతో తల్లిదండ్రులపై భారం పెరుగుతోంది. ప్రైవేటు ఉద్యోగం చేసుకునే తల్లిదండ్రులు, చిన్నాచితకా, చిరు వ్యాపారాలు చేసుకునే వారిపై బడి ఫీజుల భారం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లా కేంద్రానికి చెందిన ఒక ప్రైవేటు ఉద్యోగి తన కూతురు 9వ తరగతి చదువుతుండగా.. నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు యూనిఫాం, బడి ఫీజు, అడ్మిషన్ ఫీజు వంటివన్నీ కలుపుకొని లక్ష వరకు అవుతుందని చెప్తున్నారు. కాగా ఇంత మొత్తం ఖర్చును భరించలేక ప్రభుత్వ విద్యాసంస్థలో తన కూతుర్ని జాయిన్ చేశాడు. ఇలా ఫీజుల భారం మధ్యతరగతి కుటుంబాలపై ఎక్కువగా పడుతోంది.

సాగును అడ్డుకుంటే ఆందోళన ఉధృతం



ఆందోళనకారులతో సత్యనారాయణ

కాగజ్‌నగర్ రూరల్: ఎన్నో ఏళ్లుగా భూముల్లో సాగు చేసుకుంటున్నామని, సాగును అడ్డుకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని రైతులు స్పష్టం చేశారు. మండలంలోని కడంబా గ్రామానికి చెందిన ఐదుగురు రైతులపై అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేసినందుకు నిరసనగా శుక్రవారం గ్రామ సమీపంలోని పోడు భూముల రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న వారిని అడ్డుకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు.

ప్లాంటేషన్ భూమిని ఆక్రమించిన వారిపై కేసు

మండువా ప్లాంటేషన్‌లో 2022–23 సంవత్సరంలో పెంచిన 25 హెక్టార్లలోని మొక్కలు, కడంబా ప్లాంటేషన్‌లోని 20 హెక్టార్లలోని మొక్కలను తొలగించి కొంతవరకు అక్రమంగా అటవీ భూమిని దున్నినందుకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో రమాదేవి తెలిపారు. ప్లాంటేషన్ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న మిగతా వారికోసం దర్యాప్తు జరుగుతోందన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న సమ్మయ్య

పాతమంచిర్యాల: జూలై 8న వరంగల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కవాతు నిర్వహిస్తామని, ఈ వేడుకలకు ప్రతీ మాదిగ బిడ్డ నల్లప్యాంట్ తెల్లచొక్కా ధరించి నల్ల కండువా, చేతిలో జెండాతో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

చేపలు పట్టే విషయంలో వివాదం



నల్లవాగు చెరువు వద్ద గుమిగూడిన మత్స్యకారులు

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్ నల్లవాగు చెరువు వద్ద చేపలు పట్టే విషయంలో తాండూర్, అచ్చలాపూర్ గ్రామాలకు చెందిన మత్స్యకారుల మధ్య శుక్రవారం వివాదం ఏర్పడింది. ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో మత్స్యశాఖ అధికారులు సముదాయించడంతో ఘర్షణ సద్దుమణిగింది. తాండూర్ మత్స్యకారుల సొసైటీలో 382మంది సభ్యులుగా ఉండగా, అచ్చలాపూర్ గ్రామానికి 42మంది సభ్యులు ఉన్నారు. గత ఐదేళ్లుగా చెరువులో చేపలు పట్టే విషయంలో వివాదం కొనసాగుతోంది. తమ గ్రామ పరిధిలోని చెరువులో తామే చేపలు పట్టుకుంటామని అచ్చలాపూర్ గ్రామ మత్స్యకారులు సిద్ధమయ్యారు. ఇందుకు మత్స్యకారుల సొసైటీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. సొసైటీకి మండలంలోని అన్ని గ్రామాల చెరువులపై హక్కు ఉందని, అన్ని చెరువుల్లోనూ చేపలు పట్టుకుంటామని సొసైటీ సభ్యులు పట్టుబట్టారు. దీంతో మత్స్యకారుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. తాండూర్ మత్స్యకారులు నల్లవాగు చెరువులో చేపలు పట్టేందుకు వలలు వేశారు. అచ్చలాపూర్ మత్స్యకారులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు, మత్స్యశాఖ అధికారులు ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ నెల 18న ఇరువర్గాలు అధికారుల సమక్షంలో సామరస్యపూర్వకంగా ఒప్పందానికి వచ్చిన తర్వాతే చేపలు పట్టుకోవాలని సూచించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మహిళను పెళ్లి పేరుతో మోసగించిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చినట్లు రెబ్బెన సీఐ చిట్టిబాబు తెలిపారు. రెబ్బెన గ్రామానికి చెందిన లకావత్ రవి అదే గ్రామానికి చెందిన మహిళను ఎనిమిదేళ్లుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా లొంగదీసుకున్నాడు. మహిళ కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. దీంతో బాధిత మహిళ 2020, ఫిబ్రవరి 26న రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులు రమేశ్, అశోక్, సతీష్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో నిందితుడికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ జిల్లా జడ్జి తీర్పునిచ్చారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ అధికారి రాంసింగ్‌తో పాటు కోర్టు సిబ్బందిని ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

న్యాయం చేయాలని ఠాణా ఎదుట ధర్నా



బాధితుడికి మద్దతు పలికిన నాయకులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని తన సొంత భూమిని కబ్జా చేసిన బండారి చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని సీఐ రవీందర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధితుడు ఎరుకల దేవయ్య శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేశాడు. బాధితుడు దేవయ్య మాట్లాడుతూ రెండు దఫాలుగా ఫిర్యాదు చేసినా సీఐ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కబ్జా చేసిన చిన్నయ్య తనపై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారని పేర్కొన్నాడు. దేవయ్యకు ఐఎఫ్‌టీయూ చెన్నూర్ డివిజన్ నాయకులు ఎం.రమేశ్, పీవోడబ్ల్యూ నాయకురాలు ఎం.భవాని, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గోపినాథ్ మద్దతు పలికారు. ఈ విషయమై సీఐని సంప్రదించగా.. దేవయ్య ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని తెలిపారు.

పిడుగుపాటుకు బాలుడు మృతి

సారంగపూర్: మండలంలోని దుర్గానగర్ తండాకు చెందిన జాదవ్‌పండిత్–జాదవ్ సునీత బాయిల కుమారుడు జాదవ్ కృష్ణ(14) శుక్రవారం పిడుగు పడి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పండిత్ తన కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. ఈక్రమంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిశాయి. ఆవెంటనే పిడుగు పడడంతో కృష్ణ అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణ మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు పిడుగుపాటుకు బలికావడంతో ఆదంపతుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

పిడుగుపాటుకు సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం

బోథ్: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రం చుట్టుపక్కల శుక్రవారం సాయంత్రం పిడుగు పడటంతో ఉపకేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఉపకేంద్రం పరిధిలో దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు జిల్లా కేంద్రంలోని టెక్నికల్ బృందానికి సమాచారం అందించారు. ఆదిలాబాద్ నుంచి వచ్చిన టెక్నికల్ బృందం శ్రమించి సాంకేతిక సమస్యను గుర్తించి సరిచేశారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

తిర్యాణి: మండలంలోని గంభీరావుపేట గ్రామ శివారులో గుడుంబా తయారీకి వినియోగించే 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అక్రమ మద్యం, లేదా కల్తీ మద్యం సరఫరా చేస్తున్నాట్లు లేదా అమ్మకం చేపడుతున్నట్లు తెలిస్తే వెంటనే ఎక్సైజ్ లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రమేశ్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు సురేశ్, మమత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో 2024 మార్చి 27న జరిగిన దొంగతనం కేసులో ఒక వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ స్థానిక సెకండ్ అడిషనల్ జూనియర్ ఫాస్ట్‌ట్రాక్ కోర్ట్ న్యాయమూర్తి కే.నిరోష శుక్రవారం తీర్పునిచ్చారు. కోర్టు లైజన్ ఆఫీసర్ గులామ్ దస్తగిర్ వివరాలు తెలియజేశారు. పిల్లలమర్రి వంశీ హైటెక్ సిటీలో అపార్ట్‌మెంట్ నిర్మాణం పనులు చేపట్టాడు. నిర్మాణానికి ఉపయోగించే రూ.5,250 విలువైన ప్లంబింగ్ పైపు బెండ్ల్స్‌ను చోరీకి గురయ్యాయి. సీఐ బన్సీలాల్, ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేశారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపెల్లికి చెందిన లేకరి సాయికిరణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీ.ప్రేమలత కోర్టులో సాక్ష్యాలు ప్రవేశపెట్టి వాదనలు వినిపించగా నేరం రుజువైంది. సాయికిరణ్‌కు రెండు నెలల ఏడు రోజులు జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

రెమ్యూనరేషన్ చెల్లించాలి



డీఐఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ వార్షిక పబ్లిక్ పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ చెల్లించాలని జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఐఈవో శైలజకు వినతిపత్రం అందజేశారు. రెండేళ్లుగా ఇంటర్ బోర్డు ఆన్‌లైన్ చెల్లింపులు ఉంటాయని బ్యాంకు ఖాతాల వివరాలు సేకరిస్తోందని, చెల్లించడంలో ఆలస్యం చేస్తోందని తెలిపారు. ప్రాక్టికల్, థియరీ పరీక్షలు, స్పాట్ వాల్యూయేషన్ పాల్గొన్న వారికి గతంలోగా రెమ్యూనరేషన్ చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఎల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్, కుమురంభీం జిల్లా అధ్యక్షుడిగా నవీన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అధికారుల పాత్ర అభినందనీయం



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో జరిగిన పోలింగ్, కౌంటింగ్ కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సజావుగా నిర్వహించడంలో అధికార యంత్రాంగం పోషించిన పాత్ర అభినందనీయమని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులను ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించారన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజాసేవలో మరింత సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, వేణు, ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులు పాల్గొన్నారు.

పోలీసు ఇంటర్నెట్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు

మంచిర్యాలక్రైం: సైబర్ నేరగాళ్ల మోసాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. అమాయకులను లక్ష్యంగా చేసుకుని బ్యాంకు అధికారులమంటూ, వాట్సాప్ గ్రూపుల్లో మొబైల్ వినియోగదారులను ఆకర్షించే విధంగా లింకులు పోస్ట్ చేయడం, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌లను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖ ఉపయోగించే ఇంటర్నెట్‌ను హ్యాక్ చేశారు. నెట్ జీమెయిల్, పాస్‌వర్డ్‌లను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేయడంతో గత మూడు రోజులుగా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కావడం లేదు. రోజురోజుకు వందల పిటిషన్లు, సాధారణ కేసులు మొదలుకుని మేజర్ కేసులు, ఎఫ్ఐఆర్‌లు నమోదులో పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని కొన్ని పోలీస్‌స్టేషన్లలో బాధితులు పోలీసులు ఎఫ్ఐఆర్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శులే 'ఆసరా'

- వేలిముద్రలు పడక పింఛన్‌దారుల ఇబ్బందులు
- జిల్లా వ్యాప్తంగా 6,716 మంది బాధితులు

దండేపల్లి: ఆసరా పింఛన్ పొందే లబ్ధిదారులు కొందరికి వేలిముద్రలు పడక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 6,716 మందికి ఈ సమస్య ఎదురవుతోంది. వీరికి బదులుగా పంచాయతీ కార్యదర్శులే వేలిముద్రలు వేసి పింఛన్‌దారులకు నెల నెల పింఛన్ అందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ పనుల్లో తీరిక లేకుండా ఉండడం, సర్వర్ సమస్య తలెత్తడంతో వేలిముద్రలు పడని వారికి పింఛన్ పంపిణీ ఆలస్యం అవుతోంది. కొన్ని చోట్ల నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ జమ అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టాఫీసు ద్వారా లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకుని పంపిణీ చేస్తున్నారు. వీరికి కూడా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, గతంలో ఖాతాలు తీయించారు. కొత్తగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకుంటున్న సమయంలో బ్యాంకు ఖాతాలు జత చేసి ఇస్తున్నారు. అయినా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం లేదు. పోస్టాఫీసు ద్వారానే వేలిముద్రలు తీసుకుని అందించడంతో వారంతా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

చాలా చోట్ల సమస్యే..

వృద్ధులకు వేలిముద్రలు అరిగిపోయాయి. ప్రతీ గ్రామంలో కనీసం 30 నుంచి 40 మందికి పైనే ఇబ్బంది పడుతున్నారు. వేలిముద్రలు రాని వారంతా పంచాయతీ కార్యదర్శులు డ్రా చేసే వరకు వేచి చూడాల్సి వస్తోంది. కొంతమేర అవకతవకలు కూడా చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపించాలని, పింఛన్ డబ్బులు బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో పింఛన్‌దారుల వివరాలు

పింఛన్ రకం	లబ్ధిదారులు
వృద్ధాప్య	38,591
దివ్యాంగ	12,031
వితంతు	40,135
చేనేత	280
గీతకార్మికులు	913
ఒంటరి మహిళలు	2,512
బీడీకార్మికులు	2,350
బోదకాలు	276
డయాలసిస్	069
బీడీ టేకేదారులు	015

ఆటో బోల్తా.. ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణంలోని పాత చెక్‌పోస్ట్ సమీపంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రై వర్ చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సంతోష్(25) ధర్మాబాద్ నుంచి ఆటోలో భైంసాకు వస్తుండగా, పాత చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి గుంతలో పడింది. ఈ ఘటనలో సంతోష్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఎండీ.గౌసుద్దీన్ తెలిపారు.

ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తున్నట్లు యూత్ ట్రైనింగ్ సెంటర్ అధికారి నగేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (డీడీయూ, జీకేవై) ఆధ్వర్యంలో ప్లంబింగ్ (ఫిట్టర్)లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉద్యోగం ఇప్పించనున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 8328507232 నంబరులో సంప్రదించాలని సూచించారు.